



ప్రతీ జాతరలోనూ ఇలాంటి సమస్యలే..





కాలుష్య రహిత జాతర కలేనా?

వరంగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడారం మహాజాతరపై కాలుష్యం పడగ విప్పుతోంది. లక్షలాది మంది భక్తులు వచ్చే మహాజాతరలో వాహన కాలుష్యంతో పాటు దుమ్ము, కట్టెల పొయ్యి పొగ భక్తులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. సాధారణంగా పీల్చుకునే గాలి కంటే జాతర సమయంలో 3నుంచి 5రెట్లు గాలి కలుషితం అవుతుందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. 2020, 2022లో మేడారం జాతరలో గాలితోపాటు జంపన్నవాగు నీటిపై కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ బృందం పరిశోధనలు చేస్తోంది. జంపన్నవాగులో నీరు ప్రవాహం ఉండటంతో పెద్దగా కలుషితం కావటం లేదు. కానీ, గాలిలో మాత్రం కాలుష్యం విపరీతంగా పెరిగి చిన్నపిల్లలు, వృద్ధులు, గుండె, అస్థమా రోగులకు ప్రమాదకరంగా మారనుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాలుష్యం పెరగకుండా ముందు జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టిసారిస్తేనే భక్తుల ఆరోగ్యానికి భరోసా ఉంటుంది.

కాలుష్యం కట్టడికి కానరాని చర్యలు

మేడారం మహాజాతరకు ఏటా కోటిన్నర మంది భక్తులు వస్తారని ప్రభుత్వం ప్రకటిస్తుంది. అలాగే ఐదారు రాష్ట్రాల నుంచి భక్తులు 8లక్షలకు పైగా ప్రవేటు వాహనాలను మేడారం తీసుకవస్తున్నారు. వీటితో పాటు ఈ ఏడాది ఆరువేల ఆర్టీసీ బస్సులు జాతరకు రానున్నాయి. ద్విచక్ర వాహనాలు వేలల్లో జాతర దారిపట్టనున్నాయి. జాతరకు పెద్దసంఖ్యలో వచ్చే వాహనాలతో పొగ కాలుష్యం జాతరను ముంచెత్తుతుంది. వాహనాల రాకపోకలతో విపరీతమైన దుమ్ము లేచి గాలిలో కలిసిపోతుంది. ఇదే గాలిని ప్రాణవాయువుగా పీల్చుకుని భక్తులు లేనిపోని రోగాలను తెచ్చుకుంటున్నారు. మేడారం జాతర ప్రాంగణం నుంచి నార్లాపూర్, చింతల్, హెలీప్యాడ్ ప్రాంతం, కన్నెపల్లి, ఊరట్టం, జంపన్నవాగు, తాడ్వాయి వెళ్లే దారి, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాల్లో వాహనాల పార్కింగులతో భారీగా దుమ్ములేస్తుంటుంది. అలాగే జాతరకు వచ్చే భక్తులు కట్టెల పొయ్యి మీద వంటలు చేసుకుంటారు. ఈ కట్టెల పొయ్యితో వచ్చే పొగ క్యాన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- వాహనాల రద్దీ, జాతరలో వెలిగించే కట్టెల పొయ్యిలే ప్రధాన కారణం
- సాధారణ గాలికంటే 3 నుంచి 5 రెట్లు అధికంగా పొల్యూషన్
- చిన్నపిల్లలు, అస్థమా, గుండె వ్యాధి బాధితులకు తీవ్ర ఇబ్బందులు
- గ్యాస్, కమ్యూనిటీ కిచెన్లను ప్రోత్సహించాలని నిపుణుల సూచన

ముంచెత్తుతున్న కాలుష్యం

మేడారం జాతరలో కాలుష్యం సాధారణంగా ఉండే దానికంటే అధికంగా మూడు నుంచి ఐదు రెట్లు ఎక్కువగా ఉంటుంది. సాధారణం గా నేషనల్ యాం బి యంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్ (ఎన్‌ఏ ఏక్యూఎస్) ప్రకారం 10 పీఎం (10 మైక్రో మీటర్ల కంటే తక్కువ ఏరోడైనమిక్ వ్యాసం కలిగిన పర్టిక్యులేట్ మ్యాటర్) కంటే 3 నుంచి 5 రెట్లు ఎక్కువ గా ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి గుర్తించింది. 2020 మహాజాతర సందర్భంగా గాలి కాలుష్యంపై శాంపిల్స్ సేకరించారు. జాతరకు వారం ముందు, జాతర జరిగే నాలుగు రోజులు, జాతర ముగిసిన వారం రోజులకు ఈ శాంపిల్స్ సేకరించారు. గత జాతరలో గాలి నాణ్యత సూచిక (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్-ఏక్యూఐ) 50పీఎంలోపు ఉంటే లోపు ఎలాం టి ప్రమాదం ఉండదు. కానీ, 51 నుంచి 400ఏక్యూఐ ఉంటే సున్నితమైన వ్యక్తులు, చిన్న పిల్లలకు శ్వాస ఇబ్బందులు ఎదురవుతాయని, ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు పడుతారని, దీర్ఘకాలం శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 401కంటే ఎక్కువ ఏక్యూఐ ఉంటే ఆరోగ్యవంతులు కూడా అనారోగ్యం పడే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని కాలుష్య నియంత్రణ అధికారులు పేర్కొంటున్నారు. 2020 జాతరలో గాలి నాణ్యత సూచిక 327 పీఎం నుంచి 408 వరకు నమోదైంది. సాధారణంగా కంటే 3 నుంచి 5రెట్లు అధికంగా గాలి కలుషితమైనట్లుగా అధికారులు గుర్తించారు. 2022 జాతరలో గాలి కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శాంపిల్స్ తీయలేదని సమాచారం. ప్రస్తుతం మళ్లీ జాతరకు సంబంధించి శుక్రవారం నుంచి గాలి కాలుష్యంపై పరీక్షలు చేసేందుకు కాలుష్య నియంత్రణ మండలి సిద్ధమైంది. ప్రస్తుతం వాహనాల సంఖ్య భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో ఈసారి మరింత గాలి కాలుష్యం పెరిగే అవకాశాలు ఉన్నట్లుగా పర్యావణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొగ, దుమ్ముతో మేడారంలో గాలి కలుషితం

ప్రభుత్వం దృష్టి పెడితేనే..

ప్రభుత్వం మహాజాతరలో ప్లాస్టిక్‌పై ఎక్కువ ఫోకస్ చేస్తుంది. ప్రతీ జాతరకు ఫ్రీప్లాస్టిక్ జాతర అంటూ ప్రచారం చేయడం.. జాతర ప్రారంభం కాగానే పట్టించుకునే వారు ఉండరు. అయితే అత్యంత ప్రమాదకరమైన గాలి కాలుష్యంపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. ప్రధానంగా ఈ గాలి కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ప్రధానంగా వాహనాల రాకపోకల నేపథ్యంలో దుమ్ము లేవకుండా నిత్యం నీటిని రోడ్లపై చల్లుతూ ఉండాలని, అలాగే మురికి రోడ్లపై కంకర వేయటం, దుర్గంధం వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఎక్కువ పొగను వెదజల్లే వాహనాలను జాతరకు రాకుండా కట్టడి చేయాలని, కట్టెల పొయ్యిపై వంటలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. కట్టెల పొయ్యికి బదులుగా గ్యాస్‌ను వినియోగించేలా చూడాలని, అడవులను నరికివేయకుండా చూడాలని కోరుతున్నారు. అలాగే జాతర గద్దెలకు దూరంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, ఆ పార్కింగ్ స్థలాలు కూడా విశాలంగా ఉండటంతో పాటు అందులో తారురోడ్లు లేదా సీసీ రోడ్లు వేసేలా చర్యలు తీసుకోవాలని, దీంతో దుమ్ము లేచే అవకాశాలు తగ్గుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

గద్దెల సమీపంలోని హోటళ్లలో కట్టెల పొయ్యిల వాడకంపై నిషేధం విధించాలని, కిరోసిన్‌తో కూడా వంటల తయారీని నియంత్రించేటువంటి చర్యలతో కాలుష్య ప్రభావాన్ని తగ్గించవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కమ్యూనిటీ కిచెన్‌లను ప్రోత్సహించటంతో కూడా కొంతవరకు కాలుష్యాన్ని తగ్గించవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెడితేనే మహాజాతరలో కాలుష్యాన్ని తగ్గించి భక్తుల ఆరోగ్యాన్ని కాపాడినట్లు అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తానికి భక్తులకు తెలియకుండానే మేడారం మహాజాతరలో కాలుష్యం విషపూరితమై మానవ జీవనంపై ప్రభావం చూపిస్తుందని, కాలుష్యాన్ని కంట్రోల్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్లాస్టిక్‌ఫ్రీ జాతరగా నిర్వహించాలి
పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

వివరాలు 4లో..



జనం.. వనం బాట..

భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం

లక్షలాదిగా మేడారం తరలొస్తున్న భక్తులు

మహా జాతరకు సమయం సమీపిస్తోంది. బుధవారం జరిగిన మండమెలిగే పండుగతో జాతర సందడి రెట్టింపయ్యింది. ఇప్పటికే నెలరోజులుగా ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు సమ్మక్క సారలమ్మ గద్దెల చెంతకు తరలొస్తుండగా.. ఆ రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటివరకు 30లక్షలమంది అమ్మవార్లను దర్శించుకుని ఉంటారని, గురువారం లక్షమందికి పైగా వచ్చారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. జనం వనం బాట పడుతుండటంతో మేడారం ప్రాంతం సందడిగా మారుతోంది. ఓ వైపు భక్తులు ఏర్పాటు చేసుకుంటున్న తాత్కాలిక గుడారాలు, చిరు వ్యాపారుల అంగళ్లతో కళకళలాడుతోంది. మరోవైపు 21వతేదీ నుంచి నాలుగురోజులపాటు సాగే ఈ గిరిజన కుంభమేళాకు కోటి మందికిపైగా వస్తారని అంచనా వేస్తున్న అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొలువుదీరిన మహాజాతర ఉత్సవ కమిటీ

- 15 మందితో ప్రమాణ స్వీకారం
- హాజరైన మంత్రి సీతక్క



సీతక్కతో.. ప్రమాణ స్వీకారం చేసిన మహాజాతర ఉత్సవ నూతన కమిటీ

మేడారం, ఫిబ్రవరి 15 : మహాజాతర ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం మేడారంలో గురువారం అట్టహాసంగా జరిగింది. పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతరను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఉత్సవ కమిటీని నియమించింది. ఈనెల 12 నుంచి 25వరకు దీని కాలపరిమితిని నిర్ణయించింది. కమిటీ ఛైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్, డైరెక్టర్లుగా 13 మందితోపాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రధాన పూజారి జగ్గారావును నియమించారు. మొత్తం 15మందితో జాతర ఉత్సవ కమిటీ కొలువుదీరింది. మంత్రి సీతక్క సమక్షంలో దేవాదాయశాఖ మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం ఈ కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భక్తులకు సకల సౌకర్యాలు రూపకల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 110 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. కోటి 50లక్షలకు పైగా భక్తజనం మహాజాతరకు తరలివచ్చి సమ్మక్క, సారలమ్మలను

మిగతా 4వ పేజీలో..

మానుకోటలో బీఆర్‌ఎస్‌కు షాక్

- కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ, ఇద్దరు ఎంపీటీసీలు



కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీపీ, ఎంపీటీసీలతో ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్‌టౌన్, ఫిబ్రవరి 15 : మహబూబాబాద్ మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) భూక్య మౌనిక సురేందర్ బీఆర్‌ఎస్ పార్టీనుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆమె బాటలోనే మరో ఇద్దరు సీత్లాతండా ఎంపీటీసీ రోజానాగరాజు, మల్యాల ఎంపీటీసీ బద్రి అధికార హస్తం పార్టీలో చేరారు. మానుకోట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఎమ్మెల్యే మురళీ నాయక్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ద్వారానే అభివృద్ధి సాధ్యమని భావించిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు హస్తం పార్టీలో చేరారని చెప్పారు. అధికారం కోల్పోయిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు అసహనానికి గురై ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయి బీటలు పడితే, దానిని కప్పిపుచ్చుకోవడానికి మాజీ సీఎం నల్లగొండ సభలో అబద్ధాలు మాట్లాడారని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగుర వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, దేవరం ప్రకాశ్‌రెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాషా, బండారు వెంకన్న, రమేష్, హరిసింగ్, నీరుటి సురేష్‌నాయుడు, చంద్రు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు సేవాలాల్ గుడి నిర్మిస్తాం

- బంజరా జాతికి ఆలయాన్ని అంకితం చేస్తాం
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్
- పోలీసుల బందోబస్తు మధ్య జయంతి వేడుకలు
- జిల్లా వ్యాప్తంగా కొనసాగిన ఉత్సవాలు



శనిగపురంలో భోగ్‌బండారో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



బయ్యారంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 15 : బంజారాల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణాన్ని ఐదేళ్ల లోపు అద్భుతంగా నిర్మించి, దానిని బంజరా జాతికి అంకితం చేస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాలు, గిరిజన తండాలో సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మానుకోట శివారు అనంతాద్రి సమీపంలోని సేవాలాల్ ఆలయం వద్ద గురువారం సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత మహబూబాబాద్ తహసీల్దార్ సెంటర్ నుంచి అనంతాద్రి సేవాలాల్ ఆలయం వరకు గిరిజన సంప్రదాయ నృత్యాల నడుమ భారీ ప్రదర్శన కొనసాగింది. అనంతరం సేవాలాల్ ఆలయం వద్ద భోగ్ భండారో నిర్వహించి,అగ్నికి నైవేద్యం సమర్పించి సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి సందర్భంగా గిరిజనులకు సెలవు దినం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశానని చెప్పారు. గిరిజనుల చిరకాల కోరిక మేరకు ప్రభుత్వం ఆప్షన్ హాలిడే ప్రకటించిందని పేర్కొన్నారు. స్టాంప్, నాణెంపై సేవాలాల్ మహరాజ్ బొమ్మలను ముద్రిస్తామని నిండు అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమన్నారు. మహబూబాబాద్ జిల్లాలో సేవాలాల్ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన పదవీకాలం ఐదేళ్లలోపు గుడినిర్మాణానికి శంకుస్థాపన చేసి, నిర్మాణ అనంతరం బంజార జాతికి అంకితం

మిగతా 6వ పేజీలో..

నేడు జడ్పీస్థాయీ సంఘాల సమావేశం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశాన్ని జడ్పీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ స్థాయీ సంఘం (ప్రణాళిక, ఆర్థిక పనులు), రెండోస్థాయీ సంఘం (గ్రామీణాభివృద్ధి), మూడోస్థాయీ సంఘం (వ్యవసాయం) నాలుగోస్థాయీ సంఘం (విద్య, వైద్య సేవలు), ఐదోస్థాయీ సంఘం (మహిళ శిశుసంక్షేమం) ఆరోస్థాయీ సంఘం (సాంఘిక సంక్షేమం), ఏడో స్థాయీ సంఘం(పనుల అభివృద్ధి)పై చర్చించనున్నట్లు చెప్పారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆంగోతు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కేసముద్రం మార్కెట్‌కు నేటి నుంచి సెలవులు

● మూడు రోజులపాటు క్రయవిక్రయాలు బంద్

కేసముద్రం, ఫిబ్రవరి 15 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం (నేటి) నుంచి మూడురోజుల వరకు సెలవులు ఉన్నట్లు ప్రత్యేకహోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న కార్మిక సంఘాల దేశవ్యాప్తసమ్మె, 17, 18 శని, ఆదివారాలు వారాంతపు సెలవులు ఉన్నాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి ఈనెల 19వ తేదీన మార్కెట్‌కు సరుకులు తీసుకురావాలని ఆయన కోరారు.

హలధారి అరిగోస

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 15 : పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అహర్నిశలు శ్రమించి పండించిన మిర్చిపంటను విక్రయించుకోవడానికి అవస్థలను ఎదుర్కొంటున్నారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి బస్తాలు బుధవారం భారీగా రావడంతో యార్డు అంతా ఎర్రబంగారంతో కళకళలాడింది. సుమారు 23 వేల నుంచి 24 వేల వరకు బస్తాలను రైతులు తీసుకురాగా.. రైతులు లాట్ నెంబర్ గేట్ ఎంట్రీ కోసం, వేలం పాటలకు, కాంటాల కోసం రైతులు రోజుల తరబడి మార్కెట్ యార్డులోనే పడిగాపులు కాస్తూ అవస్థలు పడుతున్నారు.

రైతుల ఆందోళనతో పెరిగిన రాబడులు..

మానుకోట వ్యవసాయ మర్కెట్‌కు మంగళవారం 10వేల బస్తాలకు పైగా మార్కెట్ యార్డుకు మిర్చి వచ్చింది. సాయంత్రం ధరల విన్నర్ లిస్టు ప్రకటించడం, ఆ తర్వాత ధరలు తగ్గిపోవడంతో రైతులు ఒక్కసారిగా మార్కెట్ కార్యాలయాన్ని ముట్టడించి, జాతీయ రహదారిపై ధర్నా, ఆందోళన నిర్వహించారు. వేలం పాటలు జరిగినప్పటికి కాంటాలు కాకపోవడంతో సరుకు యార్డులోనే ఎక్కడికక్కడే నిలిచిపోయింది. మిగిలిన ఆ సరుకుతో పాటు మంగళవారం రాత్రి వచ్చిన మిర్చితో యార్డు మొత్తం బస్తాలతో నిండిపోయింది. మార్కెట్‌లోని షెడ్లు అన్నినిండిపోయి.. 24 వేల బస్తాల వరకు రాబడులు కొనసాగాయి. బుధవారం ఉదయం వరకు భారీ ఎత్తున మిర్చి రాబడులతో లాట్ నెంబర్లు, గేట్ పాస్‌ల టోకెన్‌ల కోసం రైతులు మార్కెట్ కార్యాలయానికి ఎగబడ్డారు. దీంతో మార్కెట్ అధికారులు రెండు క్యూలైన్లు ఏర్పాటు చేసి టోకెన్లను పంపిణీ చేశారు. ఈ సరుకు మొత్తం శుక్రవారం నాటి వరకు పూర్తిగా తూకం వేసి యార్డు ఖాళీ చేసేందుకు మార్కెట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు.

- పంట ఉత్పత్తులు అమ్ముకోవడానికి నిరీక్షణ
- మానుకోట మార్కెట్‌కు పోటెత్తిన ఎర్రబంగారం
- బుధవారం ఒక్కరోజే 24 వేల మిర్చి బస్తాల రాక
- నాలుగు రోజులుగా యార్డులోనే రైతుల ఇబ్బందులు
- లాట్ల వద్దే భోజనాలు.. 'సద్దిమూట' అమలవక అవస్థలు



యార్డులో కుప్పలపైనే నిద్రిస్తున్న రైతులు



టోకెన్ల కోసం క్యూలో నిలబడిన రైతులు

రైతుల పడిగాపులు..

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు గత ఆదివారం రోజున 10వేల బస్తాల వరకు మిర్చి రాబడులే కొనసాగాయి. గ్రామాల నుంచి మిర్చి బస్తాలు అధికంగా రావడంతో, రోజుకు 4 వేల బస్తాల వరకు మాత్రమే వ్యాపారులు ఖరీదు చేస్తున్నారు. దీంతో మరుసటి రోజు వచ్చిన మిర్చితో పాటు యార్డులో మిగిలిపోయిన మిర్చితో భారీగా సరుకులు చేరుకుంటున్నాయి. దీంతో యార్డులోనే రైతులు రాత్రి, పగలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చింది. రాత్రిళ్లు చలిగాలులు బాగా వీస్తుండడంతో మిర్చి ఘాటకు రైతులు నానా ఆగచాట్లు పడుతూ.. కొందరు నిద్రపోకుండా జాగారం చేస్తుండగా, మరికొందరు మిర్చి బస్తాలపైనే నిద్రించి సరుకును రక్షించుకుంటున్నారు.

'సద్దిమూట పథకం ఏది?

మార్కెట్ యార్డులలో రూ.5లకే భోజన పథకం (సద్దిమూట) పథకం అమల్లో ఉంది. అయితే మహబూబాబాద్ మార్కెట్‌లో

మిగతా 6వ పేజీలో..

యార్డులోనే ఉంటున్నా..

గుగులోతు నర్సింహా, రైతు, బొడ్డుగొండ, గూడూరు



నేను పది బస్తాల మిర్చిని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆదివారం తీసుకు వచ్చాను. వేలం పాటలు అయినప్పటికి తూకాలు కాలేదు. నాలుగురోజులు అవుతున్నా.. ఏ సమయంలో తూకం అవుతుందో.. లేదో తెలియడం లేదు.

మార్కెట్ నిల్వసామర్థ్యం తక్కువ..

- శంషీర్, మార్కెట్ కార్యదర్శి, మహబూబాబాద్

మానుకోట వ్యవసాయ మార్కెట్ యార్డు కేవలం 4 వేల నుంచి 5 వేల బస్తాల వరకే మిర్చి పట్టేందుకు స్థలం ఉంది. రోజు యార్డుకు వచ్చిన 5 వేల సరుకుల వరకే కాంటాలు అయిపోగానే.. కొత్తగా సరుకు వచ్చి చేరడంతో 10 వేల బస్తాల వరకు యార్డులో ఉంటుంది. గత మంగళవారం ఒక్కసారిగా యార్డుకు 25 వేల వరకు బస్తాల మిర్చి రావడంతో కాంటాలు ఆలస్యమయ్యాయి. దాంతో బుధవారం కూడా మళ్లీ కాంటలు పెట్టడం, మళ్లీ కొత్తగా సరుకురావడంతో కొంత ఇబ్బంది జరిగింది. మార్కెట్ యార్డు కెపాసిటి లేకపోవడంతో ఈ తంతు జరుగుతోంది. దశలవారీగా మిర్చి తీసుకువస్తే ఇబ్బందులు పడకుండా ఉంటుంది.




జంపన్నవాగులో శివసత్తుల పూనకాలు







బారులు తీరిన భక్తులు.. రద్దీగా మారిన గద్దెలు

● మేడారంలో కొనసాగిన దర్శనాలు ● లక్షకు పైగా తరలివచ్చిన భక్తజనం

మేడారం, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క, సారలమ్మలను భక్తులు గురువారం భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలివచ్చారు. వనదేవతల గద్దెలను నేరుగా దర్శించుకొని ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టల వద్ద తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం శివసత్తుల పూనకాలు, సమ్మక్క, సారలమ్మలకు జేజేలు పలుకుతూ డోలు వాయిద్యాల నడుమ తల్లుల గద్దెలకు చేరుకున్నారు. క్యూలైన్ల ద్వారా తల్లులను దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం(బెల్లం), పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె సమర్పించారు. కొబ్బరికాయలను కొట్టి యాట మొక్కులను చెల్లించుకున్నారు. తమ కోరికలను తీర్చాలని వనదేతలను వేడుకున్నారు. మేడారం పరిసరాల్లోని వసతి షెడ్లలో, అటవీ ప్రాంతాల్లోని చెట్లకింద వంటలు చేసుకొని ఆనందంగా గడిపారు. భక్తులు గురువారం లక్షకు పైగా దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు.

ఇప్పటి వరకు 30 లక్షల మంది

మహాజాతర నేపథ్యంలో మేడారంలో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటివరకు సుమారు 30 లక్షల మంది వనదేతలను దర్శించుకుని ఉంటారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మహాజాతరకు సుమారు రెండు నెలల ముందుగానే భక్తులు మేడారం వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.


జంపన్నవాగులో పుణ్యస్నానాలు


పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు




బంగారంతో వెళుతున్న మహిళలు


కొలువుదీరిన మహాజాతర ఉత్సవ కమిటీ

(3వ పేజీ తరువాయి)

దర్శించుకుంటారని అన్నారు. ఇప్పటికే 30లక్షలకు పైగా మంది భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారని అన్నారు. ములుగు జిల్లా కోసం పోరాడిన ముంజాల భిక్షపతితో పాటుగా జాతర అభివృద్ధికి పాటుపడిన వారికే ఉత్సవ కమిటీలో స్థానం దక్కిందన్నారు. జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలను కోరారు.

ప్రమాణ స్వీకారం చేసిన వారు వీరే..

చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్, డైరెక్టర్ మిలుకూరి ఐలయ్య, కొండి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ సింగ్, ముంజాల భిక్షపతి, సుంచు హైమావతి, చామర్తి కిశోర్, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అబ్బయ్య, అంకం కృష్ణస్వామి, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయి జగ్గారావు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.





ప్లాస్టిక్‌ఫ్రీ జాతరగా నిర్వహించాలి

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 15 : మేడారం మహాజాతరను ప్లాస్టిక్ ఫ్రీగా నిర్వహించాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. మేడారంలో ఆమె గురువారం పర్యటించారు. ముందుగా వనదేవతలను దర్శించుకొని చీరె, సారె సమర్పించారు. పారిశుధ్య నిర్వహణపై మేడారంలోని హరిత హోటల్ సమావేశ గదిలో కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్‌తో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాతర సమయం దగ్గర పడుతున్న తరుణంలో భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోందన్నారు. అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా భక్తులకు నిరంతరం తాగునీరు అందించాలని అన్నారు. జాతరలో, జాతర ముగిసిన అనంతరం కూడా ముమ్మరంగా పారిశుధ్య పనులు కొనసాగించాలన్నారు.

పంచాయతీరాజ్ కమిషనర్ అనితరామచంద్రన్ మాట్లాడుతూ.. జాతరలో నిర్వర్తించే అధికారులు చిత్తశుద్ధితో సమన్వయంతో భక్తులకు సేవలు అందించాలని అన్నారు. జాతరలో ముఖ్యంగా గద్దెల ప్రాంగణంలో బెల్లం, కొబ్బరికాయలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య సిబ్బంది, యంత్రాల ద్వారా నిరంతరం విధులు నిర్వర్తించాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి జాతర విధులకు వచ్చే అధికారులు తప్పనిసారిగా ఈనెల 19న సంబంధిత జోనల్ అధికారులకు రిపోర్ట్ చేయాలని అన్నారు. మహాజాతరలో పారిశుధ్య పనులు చేయడానికి 10సెక్టార్లు 60సబ్ సెక్టార్లుగా విభజించినట్టు తెలిపారు. డీపీవో, డీఎల్‌పీవోల ఆధ్వర్యంలో పారిశుధ్య పనుల జరుగుతాయని అన్నారు. ఫీల్డ్‌లో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులకు కేటాయించిన జోన్లలో విధులు నిర్వర్తించాలని అన్నారు. ప్రతి జోన్‌కు ఎంపీవో స్థాయి అధికారిని కేటాయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, డీపీవోలు, డీఎల్‌పీవోలు, వివిధ జోన్ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వైద్య సేవలు

హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్


మేడారంలోని ప్రధాన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న రవీంద్ర నాయక్

మేడారం, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క సారలమ్మల మహాజాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ శివప్రసాద్‌తో కలిసి జాతర పరిసరాల్లోని వైద్య శిబిరాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా భక్తులకు అందిస్తున్న సేవల గురించి డీఎంహెచ్‌వో అప్పయ్యను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ప్రధాన తాత్కాలిక ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ వైద్యం పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడుతూ మహాజాతర సందర్భంగా భక్తులకు మెరుగైన వైద్యసేవలు అదించాలన్నారు. సరిపడా మందులను నిల్వ చేసుకోవాలన్నారు. అనంతరం సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట డీసీహెచ్ జగదీశ్వర్, ఏటూరునాగారం సూపరింటెంట్ డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రేమ్‌సింగ్, డాక్టర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై నేడు సమీక్ష

హనుమకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్ నగరంలో ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం వరంగల్ ఐఎంఏ హాలులో జరిగే ఈ సమీక్షా సమావేశానికి హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వివిధ ప్రోగ్రాం అధికారులు పాల్గొననున్నారు. జాతీయ కార్యక్రమాల అమలును సమీక్షించనున్నారు. డీహెచ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ రవీంద్రనాయక్ నగరంలో సమీక్షలో పాల్గొంటున్నారు. రెండు జిల్లాలకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆహార నాణ్యత అధికారుల తనిఖీలు

మేడారం, ఫిబ్రవరి 15: మహాజాతర నేపథ్యంలో ఆహార నాణ్యత అధికారులు మేడారంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. వందల సంఖ్యలో వెలిసిన దుకాణాల్లోని ఆహార పదార్థాలను, తినుబండారాలను పరిశీలించారు. నాణ్యమైన ఆహారం భక్తులకు అందించాలని వ్యాపారులకు సూచించారు. కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఫుడ్ సేఫ్టీ అధికారులు అమృత శ్రీ, బాపుజీ, కృష్ణమూర్తి, రోహిత్‌రెడ్డి, వాసూరాం, ఎస్.అనూష, ఆర్.అనూష, ప్రత్యూష మేడారం జాతరలో విడివిడిగా తనిఖీలు చేశారు. రకరకాల రంగులు కలిపిన పదార్థాలను పరిశీలించారు. బాగా మరిగిన నూనెలు సమారు 15 లీటర్ల వరకు పారబోశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎంఆర్ రైస్‌ను త్వరితగతిన అందించాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్


మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెలాఖరులోగా సీఎంఆర్ రైస్‌నే త్వరితగతిన అందించాలనికలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో 2022-23 వానాకాలంకు సంబంధించి 1,56,737 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లు అందించాల్సి ఉన్నందున గురువారం మిల్లర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత వ్యవధిలో అందించేందుకు రోజువారీ లక్ష్యాలను సాధిస్తూ నివేదిక అందించాలన్నారు. వందశాతంలో 90శాతం పూర్తి కాగా, మిగిలిన 10 శాతం 10,919 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్‌ను నెలాఖరులోగా అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్ పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూ పరీక్షలు

డోర్నకల్, ఫిబ్రవరి 15 : అమరావతి నుంచి నాగ్‌పూర్‌కు నిర్మితమయ్యే గ్రీన్‌ఫీల్డ్ హైవే డోర్నకల్ మండలం మీదుగా వెళ్తోంది. ఇందులో భాగంగా డోర్నకల్ మండలంలో నాలుగుచోట్ల 11 మందితో కూడిన నాలుగు బృందాలు భూమి పటిష్టతపై పరీక్షలు జరిపారు. భోదీ టెక్నోక్రాట్స్ అనే కన్సల్టెన్సీ సంస్థ భూపరీక్షలు నిర్వహించిన తర్వాత నివేదికను నేషనల్ హైవే అథారిటీకి సమర్పించనున్నట్లు సంబంధిత బాధ్యులు గురువారం తెలిపారు. ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు నుంచి ముల్కలపల్లి వరకు నిర్మించిన పంచాయతీరాజ్ రోడ్డు కిలోమీటర్ 8/6, 8/8 మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే వెళ్తున్నందున అక్కడ మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు జరిపారు.

రైతాంగ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి15 : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్ అని, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తండ సతీష్ అన్నారు. ముడుపుగల్‌లో ధర్మభిక్షం 102వ జయంతి ఉత్సవాల అనంతరం సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. శ్రీనివాస్, దశరథం, వెంకటయ్య, లింగయ్య, వేముల కృష్ణ, వెంకటేష్‌గౌడ్, వెంకన్న, దర్గయ్య, రాజు, మల్లయ్య, తండ సందీప్ పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దాడి కేసులో ముగ్గురికి జైలు

నెల్లికుదురు, ఫిబ్రవరి 15 : బంజరకు చెందిన సర్పంచ్‌పై ముగ్గురు దాడి చేసిన కేసులో గురువారం ముగ్గురికి తొర్రూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత ఏడాది జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. 2015లో బంజరలో తుమ్మచెట్లు నరికిన విషయంలో అప్పటి సర్పంచ్ నెలకుర్తి వెంకట్‌రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన గుండెపాక సోమనర్సయ్య, గుండెపాక యాదయ్య, గుండెపాక ప్రభాకర్ కలసి వెంకట్‌రెడ్డిపై దాడికి పాల్పడంగా తీవ్రగాయాలైనాయి. దీంతో ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై ఉపేందర్‌రావు, కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూటర్ డి.గణేష్ ఆనంద్ వాదించారు. జూనియర్ సివిల్ జడ్జి సరిత ముగ్గురికి ఏడాది జైలుశిక్ష, ప్రతీ ఒక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

హలధారి అరిగోస

(3వ పేజీ తరువాయి)


మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు


లాట్ వద్దే భోజనం చేస్తున్న అన్నదాతలు

మాత్రం ఇది కొనసాగడం లేదు. పక్కనే ఉన్న కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మాత్రం సద్దిమూట పథకం అమల్లో ఉంది. అక్కడ విజయవంతంగా నడుస్తున్నప్పటికీ మహబూబాబాద్‌లో మాత్రం ఆపథకాన్ని అమలు చేయడం లేదు. మహబూబాబాద్ మార్కెట్‌కు సుదూర ప్రాంతాల నుంచి పక్క జిల్లాల నుంచి పండించిన మిర్చిని రైతులు మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. ప్రస్తుతం మిర్చి సీజన్ కావడంతో యార్డులో భారీగా సరుకులు రావడంతో.. దానిని వేలం పాటలు అయి.. తూకం పూర్తయ్యే వరకు మూడు, నాలుగు రోజుల సమయం పడుతోంది. దాంతో ఆ మూడు, నాలుగు రోజులు యార్డు లోనే రైతులు నిరీక్షిస్తున్నారు. అలాంటి సమయంలో రైతులకు అండగా ఉండాల్సిన సద్దిమూట పథకం అమల్లో లేకపోవడంతో రైతులు హోటళ్ల నుంచి భోజనం తీసుకువచ్చి కడుపునింపుకుంటున్నారు. దాంతో రైతుల కు అదనపు ఖర్చులు అవుతున్నాయి.

మార్కెట్ ధరలు ఇలా..

బుధవారం మహబూబాబాద్ మార్కెట్‌లో మిర్చితేజరకం క్వింటాకు గరిష్ట ధర రూ.21,689 కనిష్ట రూ.9,310, సగటున రూ.19,319 ధర పలికింది. తాలు రకం మిర్చి గరిష్ట ధర రూ.11,375, కనిష్ట రూ.7,510, సగటున రూ.11,225 ధర పలికింది.

నేటి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 15 : కేంద్రం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం జరుపతలపెట్టిన దేశ వ్యాప్తసమ్మె, గ్రామీణ సడక్‌బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మానుకోట జిల్లా కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక వివేకానందసెంటర్ నుంచి పురవీధుల గుండా తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు బి.విజయసారథి, సాదుల శ్రీనివాస్, మండల వెంకన్న, చంద్రన్న మాట్లాడారు. పదేళ్ల మోదీపాలనలో రైతులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. ప్రశ్నించే మేధావులపై కేంద్రం దాడులు చేయిస్తూ గొంతు నొక్కుతున్నారని వాపోయారు. సమ్మెలో ప్రజలు పార్టీలకతీతంగా పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బి.అజయ్‌సారథిరెడ్డి, ఆకుల రాజు, లింగ్యానాయక్, జగ్గన్న, ఐలయ్య, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, అల్వాల వీరయ్య, కుంట ఉపేందర్, పాండురంగాచారి, వెంకన్న, రాజమౌళి, వీరన్న, నాగన్న, బాబు, కోటేష్, శంకర్, యాకన్న, రజాక్, రమేష్ పాల్గొన్నారు.


తొర్రూరు పట్టణంలో మాట్లాడుతున్న యూఎస్పీసీ నాయకులు


మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

● మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : దేశ వ్యాప్తంగా ఈనెల 16న రైతులు చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకులు మల్లారెడ్డి పిలుపునిచ్చారు. అంబేద్కర్ సెంటర్‌లో సంఘం ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెకు మద్దతుగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కవిత, యాకూబ్, రమేష్, చాగంటి ప్రభాకర్, హుస్సేన్, విష్ణువర్ధన్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, ఉపేందర్, విద్యాసాగర్, రాజశేఖర్, వీరస్వామి, కుమార్, యుకయ్య, భరత్, లక్ష్మణ్, మహేందర్ పాల్గొన్నారు.

● తొర్రూరు : దేశవ్యాప్తంగా ఉన్న రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని విద్యుత్తు చట్టసవరణ, తదితర సమస్యల పరిష్కారం కోసం చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని యూఎస్పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎ.మురళీకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. తొర్రూరులోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్తు చట్ట సవరణ రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం చేపట్టే సమ్మెలో వేతన జీవులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొలుపుల శ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అయిలయ్య, సైదులు, శ్రీనివాస్, రవీందర్, సురేష్, యాకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● బయ్యారం : దేశవ్యాప్తంగా నేడు తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గ్రామీణా భారత్ బంద్ జయప్రదంకై బయ్యారంలో ద్విచక్రవాహనలో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలతో ఆయా వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. కార్మికులకు నష్టపరిచే నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, వెంకటేశ్వర్లు, రాజన్న, సూర్యం, శ్రీను, రాజేశ్వర్‌రావు, వెంకన్న, మురళీ పాల్గొన్నారు.

బాధ్యతలను స్వీకరించిన మునిసిపల్ కమిషనర్లు


మానుకోటలో బాధ్యతలను స్వీకరిస్తున్న రవీందర్

మహబూబాబాద్‌టౌన్, ఫిబ్రవరి15 : మానుకోట మునిసిపల్‌నూతన కమిషనర్‌గా నోముల రవీందర్ బాధ్యతలనుగురువారం స్వీకరించారు. ఈనెల 14న జరిగిన మునిసిపల్ కమిషనర్ల బదిలీల్లో ఇక్కడ కమిషనర్‌గాపని చేసిన కె.ప్రసన్నారాణి సిద్దిపేటకు, ఆమె స్థానంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ అడిషనల్ కమిషనర్‌గా పని చేస్తున్న రవీందర్ బదిలీ అయ్యారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఇక్కడకు బదిలీపై వచ్చిన రవీందర్ గురువారం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డిని నూతన కమిషనర్ రవీందర్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, మెప్మా డీఎంసీ విజయ, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలుందించి, శుభాకాంక్షలు తెలిపారు.

మరిపెడలో వెంకటస్వామి..

మరిపెడ : మరిపెడ మునిసిపల్ కమిషనర్‌గా ఎస్.వెంకటస్వామిని నియమిస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ రాజును ఆర్మూర్‌కు కొద్ది రోజుల క్రితం బదిలీ చేశారు. నర్సంపేట మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చిన ఎస్. వెంకటస్వామి మరిపెడ కమిషనర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మునిసిపల్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందచేశారు. మేనేజర్ కృష్ణ, వార్డు ఆఫీసర్స్ యాకయ్య, పాష, రాములు, ఆర్‌ఐ ఏకలవ్య ఆర్‌ఓ సంపత్, హెల్త్ ఇన్స్‌పెక్టర్ వీరన్న, బిల్ కలెక్టర్లు అన్సరీ, నాగరాజు, శ్రీను, గణేశ్ ఉన్నారు.

తొర్రూరులో శాంతికుమార్..


బాధ్యతలు స్వీకరిస్తున్న శాంతికునార్

● తొర్రూరు : తొర్రూరు మునిసిపల్ కమిషనర్‌గా శాంతికునార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన పి.సరస్వతి గద్వాల జిల్లా అలంపూర్ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీకావడంతో కరీంనగర్ జిల్లా చొప్పదండి మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శాంతికునార్‌బాధ్యతలు చేపట్టారు. మునిసిపాలిటీ అభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తానని, ప్రజాసమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉంటూ పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు చేపడుతామన్నారు.

'ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి'

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి15 : సేవాలాల్ జయంతి ఉత్సవ సభలో స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రం శివారు అనంతాద్రి సమీపంలోని సేవాలాల్ ఆలయం వద్ద వేడుకల అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన రాజకీయ వైషమ్యాలతో రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని, ఐదేళ్లలోపు సేవాలాల్ ఆలయ నిర్మాణం చేసేంత వరకు నిద్రపోనని వ్యాఖ్యానించడం సరైన పద్ధతి కాదన్నారు. అది మాట్లాడే ముందు ఈ ఆలయం ప్రైవేట్ ట్రస్టు అని, సేవాలాల్ ఆలయ అభివృద్ధి సూర్యచంద్ర ట్రస్టు బాధ్యత అని, దీనిపై సర్వహక్కులు ఆ ట్రస్టుకు మాత్రమే ఉంటుందన్నారు. ఆలయం నిర్మించాలని ఉత్సాహంగా ఉంటే చాలాచోట్ల సేవాలాల్ ఆలయాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయొచ్చని చెప్పారు. ఈ సేవాలాల్ ఆలయాన్ని సూర్యచంద్ర ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించి బంజార జాతికి అంకితం చేస్తామని, దీనిని ఎవరు నిర్మించాల్సిన అవసరం లేదన్నారు. తక్షణమే ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన నాయకులు గుగులోతుభీమానాయక్, నర్సింహానాయక్, లూనావత్ అశోక్, దామునాయక్, రాజునాయక్, రాందాస్‌నాయక్, నరేష్‌నాయక్ ఉన్నారు.

'ఐదేళ్లలో సేవాలాల్ గుడి నిర్మిస్తాం'

(3వ పేజీ తరువాయి)

చేస్తానన్నారు. గుడి నిర్మాణం అయ్యేంత వరకు తాను నిద్రపోయేది లేదన్నారు. ఈ ఆలయాన్ని ట్రస్టు కొనసాగిస్తూనే ట్రస్టుకు చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే పార్టీ అని, ఆ తర్వాత రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ప్రతీ నిరుపేదకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. అద్భుతమైన సేవాలాల్ ఆలయాన్ని నిర్మిస్తున్నామని, ఇప్పటికే ఆలయ నిర్మాణ పనులు మొదలై పిల్లర్ల దశ వరకు చేరుకుందని చెప్పారు. పూర్తిస్థాయిలో సూర్యచంద్ర ట్రస్టు ఆధ్వర్యంలోనే నిర్మిస్తామని, ఈ ఆలయాన్ని ఎవరు నిర్మించాల్సిన అవసరంలేదన్నారు. ఈ వేడుకల్లో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ భూక్య ఉమ, జడ్పీటీసీ లూనావత్ ప్రియాంక, జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎర్రయ్య, హార్టికల్చర్ జిల్లా అధికారి సూర్యనారాయణ, అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ఆర్డీవో అలివేలు, డీఎస్పీలు సత్యనారాయణ, వెంకటేశ్వరబాబు, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, గిరిజన సంఘాల ప్రతినిధులు గుగులోతు భీమానాయక్, గుగులోతు కిషన్‌నాయక్, దరావత్ వెంకన్ననాయక్, హట్యనాయక్, హరినాయక్ పాల్గొన్నారు.

ఆలయం వద్ద టెన్షన్ టెన్షన్..


సేవాలాల్ జయంతి వేడుకలో పోలీస్ బందోబస్తు

మహబూబాబాద్ శివారు అనంతాద్రి సేవాలాల్ ఆలయం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తొలుత మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ గిరిజన నేతలతో కలిసి ముందుగానే అక్కడికి చేరుకుని ఉన్నారు. స్థానిక శాసనసభ్యుడు భూక్య మురళీనాయక్ తహసీల్ ఆఫీస్ నుంచి సేవాలాల్ గుడి వద్దకు ర్యాలీగా బయలుదేరారు. కాంగ్రెస్ గిరిజన నేతలు కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో సేవాలాల్ గుడివద్ద ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠతతో పోలీసులు ముందుగానే భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లా అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య నేతృత్వంలో మానుకోట, తొర్రూరు డీఎస్పీలు తీర్థాల సత్యనారాయణ, వెంకటేశ్వరబాబు ఆధ్వర్యంలో 400 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవాలు సాఫీగా జరగడంతో అటు అధికారులు, ఇటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏం జరుగుతుందోన్న ఉత్కంఠతకు తెరపడింది.

మానుకోటలో..

మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని శనిగపురంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో సేవాలాల్‌గుడి వద్ద సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ముఖ్యఅతిథిగా హాజరై భోగ్‌బండారో నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ భూక్య ఉమా, సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న, మోతీలాల్, హరిసింగ్, బోడ రమేష్, బన్సిలాల్, రాంబాబు, సురేష్, స్రవంతిమోహన్, లాలునాయక్, వంశీకృష్ణ, శ్రీకాంత్, రవికుమార్, భిక్షం, అమలాబాయి, మీనాబాయి, కర్ణావత్ వెంకన్న , డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ పట్టణశివారు పత్తిపాకలో ప్రాథమిక పాఠశాలలో సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని గిరిజన సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో పిల్లలకు పలకలు, నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్, బోడ పృథ్వీరాజ్, మనోహర్‌చౌహాన్, హుస్సేన్‌నాయక్, బాప్‌సింగ్, పాఠశాల హెచ్‌ఎం వెంకన్న పాల్గొన్నారు.

● దైవకృప చిల్డ్రన్‌హోంలో గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ నేతృత్వంలో పిల్లలకుపండ్లను పంపిణీ చేశారు. పృథ్వీరాజ్, మనోహర్‌చౌహాన్ పాల్గొన్నారు.

● తెలంగాణ గిరిజన సమైక్య ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు రవీందర్‌నాయక్, లావుడ్యా బాలునాయక్ పాల్గొన్నారు.

● సేవాలాల్ సేన ఆధ్వర్యంలో శనిగపురంలో నిర్వహించిన వేడుకలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్ననాయక్, జాతీయ కమిటీ సభ్యులు మోతీలాల్‌నాయక్, నందులాల్‌నాయక్, సురేష్ పాల్గొన్నారు.

● గిరిజన సంఘం ఆధ్వర్యంలో సాంక్రియాతండాలో సేవాలాల్ జయంతి నిర్వహించగా టీజీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకన్ననాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య హరినాయక్, నూనావత్ శ్రీను, బుజ్జి, లక్ష్మి, సుజాత, పార్వతి, అశోక్, గాయత్రి, శాంతి పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

● చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో సేవాలాల్ సమితి మండల అధ్యక్షులు ఆంగోతు జగన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా లంబాడ తండాల పరిరక్షణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వెంకన్న, డీఎస్. వెంకట్యా, రాంకోటి, గండ్ల వెంకన్న, భద్రయ్య, డీఎస్.మేగ్యానాయక్, యాకన్న, దాసరి రాజు, బీఆర్‌ఎస్ సీనియర్ బర్తపురం కొమురవెల్లి, ముత్యం సత్యం, వెంకన్న, శివయ్య పాల్గొన్నారు.

● తొర్రూరులో సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మాలోతు సురేష్‌బాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణంలో శోభయాత్ర నిర్వహించారు. నాయకులు భూక్య నితిన్, లకావత్ యాదగిరి, బాలాజీనాయక్, హరి, హరీష్, దిలీప్, రాజేష్, జయసింగ్ పాల్గొన్నారు.

● బయ్యారంలో జరిగిన వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, వైస్‌ఎంపీపీ గణేష్, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డితో పాటు లంబాడ కులసంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, సేవాలాల్ సేన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● గార్ల బస్టాండ్ సెంటర్‌లో సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించగా జడ్పీటీసీ జాటోతు ఝాన్సీలక్ష్మి, ఎంపీపీ భట్టు నాగరాజు, మాజీ ఎంపీపీ మాలోతు వెంకట్‌లాల్, మాజీ సర్పంచ్ అజ్మీర భన్సీలాల్, గిరిజన నాయకులు మాలోతు శివనాయక్, గంగావత్ శ్రీనునాయక్, బోజ్యానాయక్, వీరన్న, రాజుతండాలో మాజీ సర్పంచ్ భూక్య రాంబాయి, భూక్య హరిలాల్, వెంకట్రాంనాయక్, మాలోతు సురేందర్, జాటోతు రమేష్, భూక్య హరియ పాల్గొన్నారు.

● డోర్నకల్ పంచముఖ లింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న సేవాలాల్ ఆలయం వద్ద గిరిజనులు భోగ్ భండారో నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, దారావత్ కృష్ణ, పాండునాయక్, బాలునాయక్, సేట్‌రాం, మోహన్, ప్రసాద్, లక్ష్మానాయక్, కాంగ్రెస్ నాయకులు సుమీర్‌చంద్‌జైన్ పాల్గొన్నారు.

● కురవి మండలం నేరడ బాల్యతండాలో సేవాలాల్‌సేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా డోర్నకల్ ఇన్‌చార్జి భూక్య నరేష్‌నాయక్, భూక్య వెంకన్ననాయక్, బానోత్ రాందాస్, దరావత్ బాలు, బాదావత్ శ్రీను, భూక్య కృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు. కురవిలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించగా మాలోతు కిషన్‌నాయక్, బానోత్ దేవానాయక్, రాజునాయక్, బాలునాయక్, రమేష్ పాల్గొన్నారు.

● గూడూరులో సేవాలాల్ మహరాజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించగా మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్ నాయక్, ఉత్సవకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆంగోతు ధర్మానాయక్, భూక్య సురేష్‌నాయక్, వాల్యనంద, కన్నె గురుస్వామి,భూక్య బాలునాయక్, వాంకుడోతు భరత్‌నాయక్, వాంకుడోతు గోపీనాథ్, వాంకుడోతు కొమ్మాలు, రాముడు, శ్రీనివాస్, వీరన్న, మంగీలాల్, కిషన్, మంగ్యా, రాజ్‌కుమార్, వనజ, విజయ, రజిత, బిచ్యా, కరణ్‌సింగ్, సర్దార్ పాల్గొన్నారు.

● కేసముద్రం : కేసముద్రం స్టేషన్ బ్రహ్మంగారి గుడితండాలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు తరాల వీరేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గుగులోత్ వీరునాయక్, భద్రునాయక్, పెద్దవెంకన్న, గణేష్, సుమన్, రమేష్, మోహన్, కుమార్, సేవల్ పాల్గొన్నారు.

సేవాలాల్ గొప్ప సమాజ సేవకుడు

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంత్‌సేవాలాల్ మహరాజ్ గొప్పసమాజ సేవకుని వారి ఆశయసాధనలో ప్రతీ ఒక్కరు నడవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ కోరారు. కలెక్టర్ కార్యాలయంలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ అంటే ధర్మానికి ప్రతిరూపమని, గిరిజనులకు దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, గిరిజనసంక్షేమ శాఖ ఉపసం చాలకులు ఎర్రయ్య, జిల్లా అధికారులు లక్ష్మీనారాయణ, బాలరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.


పిల్లలకు నోట్‌బుక్స్, పెన్నులు, పలకలను పంపిణీ చేస్తున్న గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్

డాక్టర్ అశోక్‌కు జాతీయ పురస్కారం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15 : హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ సత్యసాయి కళానిగంలో ఈనెల 10, 11 తేదీల్లో జరిగిన జాతీయ సెమినార్ డాక్టర్ పరికిపండ్ల అశోక్‌ను జాతీయ పురస్కారంతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ (ఐఐహెచ్‌పీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అశోక్‌ను సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తస్నీర్‌హుస్సేన్, జాతీయ ప్రధానకార్యదర్శి సుదాన్షుఆర్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో తెలంగాణలో 178 రోజులపాటు బైక్‌యాత్ర ద్వారా 13200 కిలోమీటర్లు ప్రయాణం చేశారని తెలిపారు. రాష్ట్రంలో 1860 చోట్ల సమావేశాలు నిర్వహించి సుమారు 8లక్షల మందికి హోమియోపతి ఆర్గానిక్ ఆల్బమ్ అనే మందులను ఉచితంగా అందించారని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించి జాతీయ పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి, ఆయుర్వేద, అల్లోపతి వైద్యులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

గంగారం, ఫిబ్రవరి 15 : పదో తరగతిలో ప్రతి విద్యార్థి నూరు శాతం మార్కులతో ఉత్తీర్ణత సాదించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. గురువారం గంగారం మండలంలోని పలు వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసన అనంతరం గంగారం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. తొలుత మడగూడం బాలుర వసతి గృహం, గంగారం బాలికల వసతి గృహం సందర్శించిన అనంతరం విద్యార్థుల సామర్థ్యంపై పలు ప్రశ్నలు వేశారు. మండలంలో పదో తరగతిలో 83 మంది విద్యార్థు ఉన్నారని ప్రతీ విద్యార్థి నూరుశాతం మార్కులు సాధించి ననాడే ఉన్నత పదవులు దక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పారావు, ఏఎస్‌డబ్ల్యూవో సుధాకర్, ఏహెచ్‌ఎస్ హెచ్‌ఎం వంకా సుజాత, సనప యాకలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత మార్కుల రికార్డుల పరిశీలన

మరిపెడ, ఫిబ్రవరి 15 : మునిసిపల్ కేంద్రంలోని మరిపెడ, సీతారాంపురం హైస్కూల్స్‌తో పాటు మండలంలోని ఎల్లంపేట, తానంచర్ల, గుండెపూడి, వీరారం, చిల్లంచర్ల, రాంపురం తదితర పాఠశాలల టెన్త్‌క్లాస్ విద్యార్థుల అంతర్గత మార్కుల రికార్డులను తనిఖీ బృందం గురువారం పరిశీలించారు. వార్షిక పరీక్షలకు వచ్చే ఓరల్ మార్కులకు తోడుగా అంతర్గత మార్కులు ఎంతో కీలకం కావడంతో, తనిఖీ బృందాలు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలిపే రికార్డులతో పాటు ప్రయోగాత్మక పద్ధతులను వివరించే చార్ట్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో పాటు మండల తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక ఉద్యోగి ఆత్మహత్య


చెవుగాని రాము (ఫైల్)

డోర్నకల్, ఫిబ్రవరి 15 : కడుపునొప్పి తాళలేక అమ్మపాలెం గ్రామానికి చెందిన రైల్వేఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. అమ్మపాలెం కు చెందిన చెవుగాని రాము (40) రైల్వేలో పాయింట్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబంతో కలిసి డోర్నకల్‌లోని ఓ అద్దెఇంట్లో ఉంటున్నాడు. గత కొంతకాలంగా రాము కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. చికిత్స నిమిత్తం పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నాడు. అయినప్పటికి నొప్పి పూర్తిస్థాయిలో తగ్గలేదు. రెండ్రోజుల క్రితం రాము తన స్వగ్రామమైన అమ్మపాలెంకు వెళ్లాడు. అక్కడ కడుపునొప్పి ఎక్కువ కావడంతో నొప్పిని భరించలేక గురువారం ఉదయం అమ్మపాలెంలోని తన స్వగృహంలోనే రాము ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య స్రవంతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పీహెచ్‌సీలో ఇన్సులిన్ సిరంజీల కొరత

దంతాలపల్లి, ఫిబ్రవరి 15 : మండల కేంద్రంలోని దంతాలపల్లి పీహెచ్‌సీలో సిరంజీల కొరత ఏర్పడింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కకాటు, కోతి కాటుకు గురై ఆస్పత్రికి వచ్చే బాధితులకు టీకా మందును వేసేందుకు వాడే ఇన్సులిన్ సిరంజీలు వారంనుంచి కొరతైందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ఉమ్మడి నర్సింహులపేట మండలంలోని 21 గ్రామాల నుంచి రోజు కోతులు, కుక్కలదాడి గాయపడి వస్తుండడంతో స్థానికంగా ఇన్సులిన్ సిరంజీస్‌లు లేకపోవడంతో ప్రైవేటు మెడికల్ షాపుల నుంచి రూ.10కి కొనుగోలు చేసి టీకాను తీసుకుంటున్నారు. కొందరైతే వృద్ధులు పడరాని పాట్లు పడుతూ కిలోమీటర్ల దూరం వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని రోగులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వోను వివరణ కోరడంతో సిరంజీలు కొరత వాస్తవమేనన్నారు. రెండు రోజుల్లో సిరంజీలు అందుబాటులోకి వస్తాయన్నారు.

కంప్యూటర్ సామగ్రి బహూకరణ

నర్సింహులపేట ఫిబ్రవరి 15 : మండలంలోని పెద్దనాగారం ప్రభుత్వ హైస్కూల్‌కు పాఠశాల పూర్వవిద్యార్థి 2006-07 బ్యాచ్‌కు చెందిన బ్లాక్ చైన్ వ్యాపారవేత్త అజ్మీర నాగయ్య రూ. 25 వేల విలువగల కంప్యూటర్ సామగ్రిని గురువారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం జానకీ సుమన మాట్లాడారు.